సాక్షి సూర్యాపేట

ఆదివారం । 2 । జూలై । 2023



మద్యపాన నిషేధంలో ఆదర్శం

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బండపాలెం గ్రామం మద్యపాన నిషేధంలో ఆదర్శంగా నిలుస్తోంది. - 8లో



జల్సాలకు అలవాటు పడి..

చౌటుప్పల్‌లో ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేసే ఇద్దరు యువకులు జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీకి పాల్పడ్డారు. - 8లో

గరిష్టం/కనిష్టం 36° / 28°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ నాగార్జునరెడ్డి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇది ఏ మూలకు సరిపోవని, ప్రతి నియోజకవర్గానికి 10వేల ఇళ్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఎల్గూరి గోవింద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత, జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సైదమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, చిన్నపంగ నరసయ్య పాల్గొన్నారు.

రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలి



సహకార బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): సహకార బ్యాంకుల్లో రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు షేక్ అలీముద్దీన్ కోరారు. శనివారం సూర్యాపేటలోని నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం వద్ద ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు సహకార బ్యాంకుల ఎదుట నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉదయ్, అక్తర్, మాధవి, రజిత, మౌనిక, శ్రీను, రైతులు రైతులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఆలయంలో సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి, అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా ప్రధానాలయంలోని ముఖమండపంలో స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

యాదాద్రీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ తదితర కైంకర్యాలు గావించారు. పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఆ నాలుగింటిపై నజర్!



సర్వేల్లో వీక్ ఉన్నట్లు తేలిన స్థానాలపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి

- సాగర్, కోదాడ, మునుగోడు, నకిరేకల్ సెగ్మెంట్‌లపై ఫోకస్
- ఎలా ముందుకు వెళ్దామని మంత్రి జగదీష్‌రెడ్డితో మంతనాలు
- నాలుగు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై గులాబీ బాస్ ఆరా
- త్వరలోనే నల్లగొండ, సూర్యాపేటలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తమ పార్టీని చక్కదిద్దేందుకు గులాబీ బాస్ కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎక్కడెక్కడ అసంతృప్తులు ఉన్నారో.. ఏయే నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉందో తెలుసుకుంటున్నారు. ప్రతికూల పరిస్థితులను ఎలా అనుకూలంగా మార్చుకోవాలో పార్టీ నేతలకు సూచించారు. ముఖ్యంగా నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నేతల మధ్య కొరవడిన సఖ్యతపై ఆరా తీస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీని సిద్ధం చేసేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాపై గులాబీ బాస్, సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. తమ సర్వేల్లో వీక్‌గా ఉన్న స్థానాల్లో ఎలా ముందుకు సాగాలన్న దానిపై ఇప్పటికే పలుమార్లు దిశా నిర్దేశం చేశారు. అసంతృప్తులు బయటకు వస్తున్న తరుణంలో ఆయా నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఏయే నియోజక వర్గాల్లో ఎవరెవరు అసంతృప్తితో ఉన్నారు.. ఎవరు టికెట్ ఆశిస్తున్నారనే విషయాలపై ఆరాతీస్తున్నారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, మునుగోడు, నకిరేకల్, కోదాడ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం, నేతల మధ్య కొరవడిన సఖ్యతను ఏవిధంగా సరిచేయాలన్న దానిపై ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో చర్చించినట్లు సమాచారం. మందుల సామేలు పార్టీని వీడిన నేపథ్యంలో పార్టీ పరిస్థితిపై ఇతర నియోజక వర్గాల్లోనూ పరిస్థితిపై అరాతీసినట్లు తెలిసింది.

సిట్టింగ్‌లకే టికెట్ ఇస్తామన్నా..

రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే టికెట్లు ఇస్తామని అధినేత కేసీఆర్ పలుమార్లు ప్రకటించినా, ఆయన చేయిస్తున్న సర్వేలు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు రేపుతున్నాయి. ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందా.. ఉంటే ఏ మేరకు ఉంది.. అభ్యర్థిని మార్చితే పార్టీ గెలిచే పరిస్థితి ఉంటుందా.. తదితర అంశాలపై సీఎం కేసీఆర్ దృష్టిపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుత సర్వేల ప్రకారం వీక్‌గా ఉన్నట్లు భావిస్తున్న మునుగోడు, నకిరేకల్, నాగార్జునసాగర్, కోదాడ నియోజ వర్గాల్లో ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, అక్కడున్న నేతల మధ్య వర్గాలు, అక్కడ టికెట్ ఆశిస్తున్న వారిలో బలంగా ఎవరున్నారు? పార్టీ నేతల మధ్య ఉన్న వర్గ విబేధాలు, ఇబ్బందికర పరిస్థితులను ఎలా సరిచేయవచ్చని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

నాలుగు స్థానాల్లో నాలుగు రకాలుగానే..

- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గాల మధ్య సఖ్యత కనిపించడం లేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అక్కడి సమస్యను ఏవిధంగా పరిష్కరించాలి, ఎలా సమన్వయం చేయాలన్న దానిపైన పార్టీ తర్జన భర్జన పడుతోంది. ఒకవేళ అభ్యర్థిని మార్చితే తమకు అవకాశం ఇవ్వాలని ఆశావహులు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మన్యం రంజిత్ యాదవ్ కూడా తమ ప్రయత్నాలు చేస్తున్నారు.
- నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వీరేశం మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ముఖ్యమంత్రి సిట్టింగులకే టికెట్ ఇస్తామనడంతో ఒక దశలో వీరేశం పార్టీని వీడతారన్న చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఆయనతో మంతనాలు జరిపారు. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ పెద్దలు వేచి చూడాలని చెప్పినట్లు తెలిసింది.
- కోదాడలో సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు పోటీగా కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. దీంతో పార్టీ అక్కడ ఎవరికి ఏవిధంగా సర్దిచెప్పాలనే ఆలోచన చేస్తోంది.
- ఇక మునుగోడులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఈసారి టికెట్ ఇవ్వరన్న చర్చ సాగుతోంది. ఉప ఎన్నికల్లో అధిష్టానం అందరిని ఒకటి చేసి పార్టీ గెలిపించుకుంది. సాధారణ ఎన్నికలు అందుకు భిన్నమైనవి కావడంతో అభ్యర్థి మార్పు తప్పదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఈ నియోజకవర్గాల్లో పరిస్థితులను చక్కదిద్దేందుకు అధిష్టానం రంగంలోకి దిగనుంది.

త్వరలో ముఖ్యమంత్రి రాక

నల్లగొండ పట్టణంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు త్వరలో కేసీఆర్ వస్తారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. నల్లగొండను సీఎం దత్తత తీసుకొని అభివృద్ధి పనులు మంజూరు చేశారు. అవి ఇప్పుడు పూర్తి కావచ్చాయి. వాటిని ప్రారంభించడంతో పాటు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పేందుకు నల్లగొండలో కేసీఆర్ సభ పెట్టాలని పార్టీ యోచిస్తోంది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిని ప్రారంభించేందుకు సీఎం సూర్యాపేటకు వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి సభతో జిల్లాలో ఎన్నికల ప్రచారానికి తెరలేపాలని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. మిగతా నియోజకవర్గాల్లో మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పర్యటిస్తారు.

పునర్జన్మనిచ్చేది వైద్యులే..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: తల్లిదండ్రులు జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలో బాలాజీ గార్డెన్స్, ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత వైద్య రంగంలోనూ, వ్యక్తిత్వం పరంగా భావితరాలకు డాక్టర్ బీసీరాయ్ ఆదర్శనీయుడని అన్నారు. కరోనా సహా అన్ని ఆరోగ్య విపత్తుల కాలంలో వైద్యుల సేవలు మరువలేనివని తెలిపారు. రాష్ట్రంలో కరోనాను ఎదుర్కొనే క్రమంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి రోగులకు సేవలందించిన ప్రతి వైద్యుడికి, వారికి సహకరించిన కుటుంబ సభ్యులకు అభినందలు తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, బస్తీ దవాఖానాలు, పల్లె దవఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక సదుపాయాలతో ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య యజ్ఞంలో, వైద్యులు నారాయణులై తమ వంతు పాత్ర పోషిస్తున్నారన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా అన్ని రకాల రోగ నిర్ధారణ చేసే కేంద్రాలను ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేశామన్నారు. దావాఖానాల్లో అన్ని స్థాయిల్లో మౌలిక వసతులను మరింత మెరుగు పర్చాలన్నారు. బస్తీ దవాఖానాల ఏర్పాటుతో డాక్టర్ల సేవలను గల్లీలోని సామాన్యుల చెంతకు చేర్చామని చెప్పారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గులాం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు లేవన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి బేసిక్ వేతనాన్ని నిర్ణయించి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, సహాయ కార్యదర్శి కాసర్ల దుర్గయ్య, కోశాధికారి వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు జీవన్ కుమార్, వాజీద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–4కు 82.42 శాతం హాజరు



సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

- ప్రశాంతంగా ముగిసిన పరీక్ష
- పేపర్–1కు 24,977 మంది, పేపర్–2కు 24,894 మంది హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

సూర్యాపేట: జిల్లాలో శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్– 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 30,313 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్– 1 పరీక్షకు 24,977 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్– 2 పరీక్షకు 24,894 మంది హాజరయ్యారు. పేపర్– 1లో 82.42 శాతం, పేపర్– 2లో 82.12 శాతం హాజరు శాతం నమోదైంది. పేపర్– 1లో 5,336 మంది, అలాగే పేపర్–2లో 5,419 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పలు సెంటర్లలో కేటాయించిన సమయం కంటే అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుతిరిగారు.



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

పరీక్షా కేంద్రాల పరిశీలన

పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వెంకట్రావు పరిశీలించారు. సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరుతెన్నులు, అభ్యర్థుల హాజరు వివరాలు, అందుబాటులో ఉంచిన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు.



పరీక్షకు వెళ్లే ముందు చిన్నారులకు టిఫిన్ తినిపిస్తున్న తల్లి



సూర్యాపేటలోని ఏవీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన మహిళ

అనాథల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి



దీక్ష చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : అనాథ పిల్లల సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించారు. తల్లిదండ్రులు లేని పిల్లలను ప్రభుత్వమే ఆదుకుంటుందని సీఎం కేసీఆర్ జూన్ 23, 2018లో చెప్పినా ఇప్పటివరకు అది అమలుకాలేదని అన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీను, బీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, ప్రశాంత్, మల్లయ్య, లక్ష్మయ్య, అనుదీప్, సాయి, నీరజ్, అభిలాష్, అవినాష్, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

ఏఓలు లేక ఇక్కట్లు

- మూడు మండలాల్లో లేని వ్యవసాయాధికారులు
- అందుబాటులో ఉండని ఇన్‌చార్జ్ అధికారులు
- సాగులో మెలకువలు తెలియక ఆందోళన చెందుతున్న రైతులు



చింతలపాలెం మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయం

హుజూర్‌నగర్: రైతులకు సాగులో మెలకువలు నేర్పించి సూచనలు, సలహాలు ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. వానాకాలం రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. ఈ నేపథ్యంలో కొన్ని మండలాల్లో పూర్తి స్థాయిలో వ్యవసాయ అధికారులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలియక ఆందోళన చెందాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

ఒకరు లాంగ్ లీవ్‌లో.. ఇద్దరు బదిలీపై..

జిల్లాలో ప్రస్తుతం మూడు మండలాలల్లో వ్యవసాయ అధికారులు (ఏఓలు) లేరు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల ఏఓతో పాటు నూతనంగా ఏర్పడ్డ చింతలపాలెం, పాలకవీడు మండలాలకు ఏఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఒకరు లాంగ్ లీవ్ పెట్టగా ఇద్దరు ఏఓలు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయా మండలాలకు పక్క మండలాల ఏఓలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఆరుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) లేరు. మొత్తం 84 మంది ఏఈఓలు ఉండాల్సి ఉండగా 78 మంది మాత్రమే ఏఈఓలు ఉన్నారు. సూర్యాపేట, మఠంపల్లి, బాలెంల, మోతె, చింతిర్యాల, అనంతగిరిలో ఆరు ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న ఏఈఓలను అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేస్తారని తెలిసింది.

రెగ్యులర్ ఏఓలు లేక సమస్య..

ఖాళీగా ఉన్న ఏఓ స్థానాల్లో పక్క మండలాల ఏఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాలను చూడడం వీరికి భారంగా మారింది. దీంతో ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఓలు రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండడం లేదు. సాగు విషయంలో ఏమైనా సలహాలు సూచనలు తీసుకోవాలంటే ఎవరిని అడగాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని నెలలుగా కార్యాలయాల్లో భూసార పరీక్షలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. భూసారం తెలియక ఎరువులు ఏవి వేయాలో రైతులు అయోమయం చెందుతున్నారు. వ్యవసాయానికి ఏరకమైన సబ్సిడీ పరికరాలు కూడా ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు.

సమావేశాలు ఉంటేనే ఏఓల రాక..

ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న మండల వ్యవసాయ అధికారులు అధికారులు లేదా.. ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటేనే ఆయా మండలాలకు వస్తున్నారని రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. మండల పరిషత్ సమావేశాలు, ఇతర అధికారిక కార్యక్రమాలు ఉంటేనే కనబడుతున్నారని అంటున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి మండలానికి ఒక ఏఓను కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

రెగ్యులర్ ఏఓను నియమించాలి



ప్రస్తుతం రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో మండల వ్యవసాయ అధికారి లేకపోవడంతో రైతుల సందేహాలను తీర్చి సలహాలు ఇచ్చేవారు అందుబాటులో ఉండడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైఅధికారులు ఆలోచించి వెంటనే చింతలపాలెం మండలానికి వ్యవసాయ అధికారిని నియమించాలి.

– యర్రం శంభిరెడ్డి, రైతు, చింతలపాలెం

పక్క మండలాల వారికి బాధ్యతలు అప్పగించాం



జిల్లాలో ప్రస్తుత మూడు మండలాలకు ఏఓలు లేరు. కొత్తగా ఏర్పడ్డ మండలాలకు ఏఓ పోస్టులు మంజూరు కాలేదు. ఒక మండల ఏఓ లీవ్ పెట్టడంతో ఖాళీగా ఉంది. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సమీప మండలాల ఏఓలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. జిల్లాకు ఏఓలు మంజూరు కాగానే వారిని ఆయా మండలాలకు పంపించడం జరుగుతుంది. ఖాళీగా ఉన్న ఏఈఓలను అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేస్తాం.

– రామారావు నాయక్, డీఏఓ, సూర్యాపేట

కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ వెంకట్రావ్



కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని కలెక్టర్ వెంకట్రావ్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సూర్యాపేట పట్టణంలోని కుడకుడలో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను శనివారం అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుందరీకరణలో భాగంగా గ్రీనరీ ఎక్కువగా ఉండాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని అన్ని గదులను పరిశీలించి పవర్ సప్లయ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్, రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సిబ్బంది నివాస గృహాల పనుల్లో వేగం పెంచాలన్నారు. వర్కర్ల సంఖ్యను పెంచి పనులు త్వరగా అయ్యే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ నర్సింహ నాయక్, ఈఈ యాకుబ్, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలి

మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ వెంకట్రావు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలసి మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులతో మున్సిపాలిటీలో భగీరథ నీటి లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవంతీపురం నుంచి సూర్యాపేట మున్సిపాలిటీకి వచ్చే నీటి సరఫరాలో పైప్ లీకేజ్ మరమ్మతులపై సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా నీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు బోల్తా.. వ్యక్తి దుర్మరణం


రామాచారి (ఫైల్)

కొండమల్లేపల్లి: కారు బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకా రం.. మండలంలోని కుర్మేడు గ్రామానికి చెందిన శ్రీరామదాసు రామాచారి(37) గోల్డ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో తన బంధువుల శుభ కార్యానికి హాజరై రాత్రి తన కారులో తిరిగి కుర్మేడుకు బయల్దేరాడు. మార్గమధ్యలో కొండమల్లేపల్లిలోని హైదరాబాద్ రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రామాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

జిన్నింగ్ మిల్లులో చోరీ

మోత్కూరు: మండలంలోని దత్తప్పగూడెం శివారులో నటరాజ్ జిన్నింగ్ మిల్లులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నటరాజ్ జిన్నింగ్ మిల్లులో గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి సుమారు రూ.4 లక్షల విలువైన 24 మోటార్లు, బేరింగ్‌లు, వెయిట్ ప్లేట్లు దొంగిలించారు. మిల్లు వాచ్‌మెన్ నర్సింహ అదే నెల 29వ తేదీన సామగ్రి కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. రామన్నపేట సీఐ మోతీరామ్ ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి విలేకరులకు తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు

- ఈజీ మనీ కోసం బైక్‌లు చోరీ చేస్తున్న యువకులు
- దొంగిలించిన బైక్‌లను హైదరాబాద్‌లో అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య


పట్టుబడిన ద్విచక్రవాహనాలు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మొగిలయ్య, వెనకాల నిందితులు

చౌటుప్పల్: ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేసే ఇద్దరు యువకులు మద్యానికి బానిసవ్వడంతో పాటు జల్సాలకు అలవాటుపడ్డారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలని భావించి బైక్‌ల చోరీకి పాల్పడ్డారు. చోరీ చేసిన బైక్‌లను విక్రయించేందుకు శనివారం హైదరాబాద్‌కు వెళ్తుండగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్ రోడ్‌లో పోలీసులకు చిక్కారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ మొగిలయ్య విలేకరులకు వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన సంపంగి శివ, అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముద్దంగుల సింహాద్రి స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరు ఒకరికొకరు బంధువులవుతారు. డ్రైవింగ్ చేయడం ద్వారా వచ్చే సంపాదన సరిపోకపోవడంతో ఇద్దరూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరూ జల్సాలకు, మద్యానికి అలవాటుపడ్డారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశతో బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు.

వివిధ ప్రాంతాల్లో 10 బైక్‌లు..

అనుకున్న ప్రకారంగా ఇద్దరూ కలిసి బైక్‌ల దొంగతనాలకు పూనుకున్నారు. సంపంగి శివ చౌటుప్పల్‌తో పాటు హైదరాబాద్‌లోని హయత్‌నగర్, ఎల్బీనగర్, సూర్యాపేట జిల్లా చివ్వెంలలో 8బైకులను దొంగిలించాడు. అంతేకాకుండా ముద్దంగుల సింహాద్రితో కలిసి చౌటుప్పల్, హయత్‌నగర్‌లో మరో 2బైకులను చోరీ చేశారు. ఇలా చోరీ చేసిన బైక్‌లను తంగడపల్లిలోని శివ ఇంట్లో దాచిపెట్టారు.

హైదరాబాద్‌లో బేరం మాట్లాడేందుకు వెళ్తూ..

దొంగిలించిన 10 బైక్‌లను విక్రయించాలని అనుకొని, ముందుగా బేరం మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. స్థానికంగా అయితే ఇబ్బందులు వస్తాయని భావించి హైదరాబాద్‌లో బైక్‌లను విక్రయించాలనుకున్నారు. ఈ క్రమంలో శివ శనివారం తంగడపల్లిలోని తన ఇంట్లో నుంచి దొంగిలించిన బైక్‌లలో ఒకదానిని తీసుకొని అంకిరెడ్డిగూడెం వెళ్లి అక్కడ సింహాద్రిని ఎక్కించుకొని హైదరాబాద్ బయల్దేరాడు. అదే సమయంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు నంబర్ ప్లేట్ లేని కారణంగా వీరి బైక్‌ను ఆపారు. ఆరా తీయగా ఆ బైక్ చోరీ చేసిందని గుర్తించారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా తాము చేసిన బైక్‌ల దొంగతనాల గురించి పూసగుచ్చినట్లు వివరించారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ ఎస్. దేవేందర్, ఎస్‌ఐలు యాదగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


శ్రీను (ఫైల్)

కనగల్: మండల కేంద్రంలోని సెల్‌టవర్ వద్ద శనివారం విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన బుచ్చల శ్రీను(26) అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన లైన్‌మన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ టవర్ వద్ద ఫ్యూజ్ పోవడంతో లైన్‌మన్ ఎల్‌సీ తీసుకుని శీనును పంపించి చూసి రమ్మన్నాడు. ఈ మేరకు శీను టవర్ వద్దకు వెళ్లి పక్కనే ఉన్న స్తంభంపై పైకి ఎక్కి పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడడంతో ఇనుప చువ్వ కిడ్నీ భాగంలో బలంగా గుచ్చుకోవడంతోనే తీవ్రంగా గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీను విద్యుదాఘాతానికి గురయ్యాడా.. లేదా ప్రమాదవశాత్తు జారి పడ్డాడా అని విషయంలో పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి నాలుగేళ్ల క్రితమే పెళ్లి కాగా, ఒక కుమారుడు ఉన్నాడు.

హైవేపై వరుసగా ఢీకొన్న వాహనాలు

- స్తంభించిన ట్రాఫిక్


మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

చౌటుప్పల్: మండల పరిధిలోని లక్కారం గ్రామంలో జాతీయ రహదారిపై శనివారం ఒకదాని వెనుక మరొకటి మూడు వాహనాలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ మినీ వ్యాన్ లక్కారం గ్రామ పరిధిలోకి రాగానే డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న మరో లారీ వచ్చి మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు సైతం తన ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో హైదరాబాద్–విజయవాడ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో రెండు కార్లు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. ఈ రెండు ప్రమాదాల్లో వాహనాలు దెబ్బతిన్నప్పటికీ ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

కోదాడరూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధుడు జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని దోరకుంటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోరకుంట గ్రామానికి చెందిన కె. యలమంద(72) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు శుక్రవారం ఉదయం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగేశ్వరరావు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ది. నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.నల్లగొండ
బ్రాంచి : మిర్యాలగూడ

స్థిరాస్తి (వ్యవసాయ భూములు) బహిరంగ వేలము ప్రకటన

తెలంగాణ సహకార సంఘముల రూల్–52 ఇ ప్రకారము

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లి., బ్రాంచి : మిర్యాలగూడ నుండి దీర్ఘకాలిక అప్పు పొంది అట్టి అప్పు బాపతు వాయిదా మీరిన చెల్లించని కిస్తులు రాబట్టుకొనుటకు ఈ క్రింది బకాయిదారునకు సంబంధించిన నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., బ్రాంచి : మిర్యాలగూడ నకు తాకట్టు పెట్టబడిన స్థిరాస్తి (భూమి) బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. వేలము వేయబడు భూముల వివరములు, తేదీ మరియు ప్రదేశము ఈ క్రింద తెలుపబడినది. వేలములో పాల్గొను వ్యక్తులు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి వేలములో పాల్గొనవచ్చును.

క్ర. నెం.	బకాయిదారుని పేరు మరియు తండ్రి పేరు	సర్వే నెం.	విస్తీర్ణము ఎ.గుం॥	భూమి ఉన్న శివారు గ్రామము	వేలము తేదీ సమయం	వేలము వేయు ప్రదేశము
1	మకరబోయిన పెద్ద రంగయ్య తండ్రి : సీతారామయ్య గ్రా॥ చిట్యాల, మం॥ అడవిదేవులపల్లి	11/1/1	2-21	చిట్యాల	తేదీ.5-7-2023 మ॥ 12.00 గం॥లకు	గ్రామ పంచాయతీ కార్యాలయము గ్రా॥ చిట్యాల మం॥ అడవిదేవులపల్లి
2.	నక్క సైదమ్మ భర్త : చిన్నయ్య గ్రా॥ చిట్యాల మం॥ అడవిదేవులపల్లి	240/1	1-06	చిట్యాల	తేదీ.5-7-2023 మ॥ 3.00 గం॥లకు	గ్రామ పంచాయతీ కార్యాలయము గ్రా॥ చిట్యాల మం॥ అడవిదేవులపల్లి
		మొత్తం	3.27			

వేలము - నియమ నిబంధనలు

1. వేలము వేయబడు భూములు బ్యాంకు వారికి తాకట్టు పెట్టబడినందున జప్తు చేయబడి వేలము వేయబడుచున్నది.
2. వేలములో పాల్గొను వ్యక్తి వేలమునకు ముందుగా రూ॥ 25,000/- (అక్షరాల ఇరవై ఐదు వేల రూపాయలు) డిపాజిట్ (ఇ.ఎం.డి.) సేల్ ఆఫీసర్ వద్ద డిపాజిట్ చేసి వేలములో పాల్గొనవచ్చును.
3. వేలములో సరైన ధర వచ్చినట్లు భావించినచో, అత్యధిక పాటదారుని పేరున వేలము ఖరారు చేయబడును.
4. అత్యధిక పాటదారుడు వేలము విలువలో 15% వేలము ముగిసిన వెంటనే చెల్లించవలయును. మిగతా 85% మరియు స్టాంపు డ్యూటీ ఫౌండేజీ చార్జీలను కూడా వేలము తేదీ నుండి 15 దినములలోగా పూర్తిగా చెల్లించవలయును. లేనిచో చెల్లించిన సొమ్ము తిరిగి ఇవ్వబడదు. మరియు జప్తు చేసుకోబడును.
5. ఎట్టి పరిస్థితిలో కూడా 15 దినములకు మించి సమయం ఇవ్వబడదు.
6. వేలములో ఒక వ్యక్తికి మించి పాల్గొనదలచినచో అట్టి వ్యక్తులు ఉమ్మడిగా వేలములో పాల్గొనుచున్నట్లు అందరి తరుపున ఒక వ్యక్తికి అధికారమిస్తూ అఫిడవిట్ ఇవ్వవలయును. అట్టి అఫిడవిట్ రూ॥ 50/-ల స్టాంపు పేపరు పై ఇవ్వాలి.
7. వేలములో పాల్గొను వ్యక్తులు వేలము నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్నట్లు వేలమునకు ముందే నిర్ణీత ఫారంలో అంగీకారం ఇవ్వవలయును.
8. వేలములో పాల్గొను వ్యక్తులు ప్రకటించబడిన భూములను స్వయముగా సందర్శించి, తృప్తిపడి అన్ని విషయములు తెలుసుకొని వేలములో పాల్గొనుచున్నట్లుగా భావించబడును.
9. సదరు భూములకు రహదారుల విషయములో ఏ విధమైన హామీలు బ్యాంకు తరుపున ఉండవు. స్థానికంగా ఉన్న వసరులే అంతిమం.
10. కొనుగోలుదారుడు పూర్తి డబ్బు చెల్లించి భూమి మార్పిడి చేసుకొను వరకు అట్టి భూమిపై ఏ విధమైన హక్కు ఉండదు.
11. వేలము వేయబడు భూమి విషయములో ఏ విధమైన అభ్యంతరములు వచ్చిననూ అవి పరిష్కరించు ఉత్తర్వులు జారీ చేసిన పిదప వేలము ఖరారు చేయబడును.
12. వేలము వేయబడు భూములు ఏకమొత్తముగా గాని, విడివిడిగా గాని, విక్రయించుటకు సేల్ ఆఫీసర్‌కి పూర్తి అధికారము కలదు. ఎట్టి కారణములు చూపకుండా వేలము వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని అధికారము కలదు. (DR / OSD, N.D.C.C. Bank Ltd., Nalgonda ఉత్తర్వుల ప్రకారం)
13. ఇతర వివరములకు సేల్ ఆఫీసర్ గారిని గానీ, డిప్యూటీ రిజిస్ట్రార్ / ఓ.యస్.డి. గారిని గానీ సంప్రదించవచ్చును.

స్థలం : మిర్యాలగూడ
తేది : 01.07.2023

Manager Legal : 8096949757
Branch Manager : 9912344239

సేల్ ఆఫీసర్
యన్.డి.సి.సి.బ్యాంకు లి., నల్లగొండ
బ్రాంచి : మిర్యాలగూడ

సరదాగా వెళ్లి మృత్యు ఒడిలోకి..

- ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి పదో తరగతి విద్యార్థి మృతి


మహేష్ (ఫైల్)

మునుగోడు: పాఠశాలకు వెళ్లి వచ్చిన ఓ విద్యార్థి సరదాగా ట్రాక్టర్‌పై వెళ్లి మృతిచెందిన ఘటన మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోతులారం గ్రామానికి చెందిన గుర్జ బుచ్చయ్య, ధనమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు గుర్జ మహేష్(15) సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగా శనివారం కూడా మహేష్ పాఠశాలకు వెళ్లి ఇంటి వచ్చాడు. అదే సమయంలో గ్రామానికే చెందిన ఓ వ్యక్తి పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై పలివెల గ్రామానికి వెళ్తుండగా తాను వస్తానని మహేష్ ట్రాక్టర్ ఎక్కి డ్రైవర్ పక్కనే కూర్చున్నాడు. ఇరువురు వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ పక్కన కూర్చున్న మహేష్‌కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ నడిపిన డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భువనగిరి: పట్టణంలోని మీనానగర్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి మతిస్థిమితం సరిగ్గా లేక భువనగిరి పట్టణంలో గత కొంతకాలంగా భిక్షాటన చేస్తూ ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన లింగమ్మ(45) యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో కస్తూర్బా పాఠశాలలో వంటమనిషిగా పనిచేస్తుంది. దివ్యాంగురాలైన ఆమె వ్యక్తిగత పని నిమిత్తం సూర్యాపేటకు వెళ్లి తనకు తెలిసిన యువకుడితో కలిసి స్కూటర్‌పై తిరుగు ప్రయాణమయ్యింది. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై గల బ్రిడ్జి వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లింగమ్మతో పాటు స్కూటర్‌ను నడుపుతున్న యువకుడికి తీవ్రగాయాలు కాగా, వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

మద్యపాన నిషేధంలో ఆదర్శం

- 38ఏళ్లుగా అమలు చేస్తున్న బండపాలెం గ్రామస్తులు
- మద్యం అమ్మినా, తాగినా జరిమానా నిబంధన
- అతిక్రమిస్తే గ్రామ బహిష్కరణ


బండపాలెం గ్రామం వ్యూ

కోదాడరూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్సిపాలిటీ పరిధిలోని అదో చిన్న గ్రామం. జనాభా కూడా ఆరు వందల లోపే. అంతగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన గ్రామం కూడా కాదు. అందరూ వ్యవసాయం, కూలిపనులు చేసుకుని జీవనం సాగించేవారే.. అయినా.. 38ఏళ్లుగా ఆ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. బండపాలెం గ్రామస్తులు. 38ఏళ్ల కిందట దసరా పండుగ రోజున మద్యం తాగి ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడడంతో అది కుటుంబాల మధ్య పెద్ద చిచ్చురేపింది. దీంతో గ్రామంలో అశాంతి నెలకొంది. దాంతో నాడు ఆ గ్రామపెద్దలు, ప్రజలు కలిసి గ్రామం బాగుండాలి అంటే ఊరిలో సారా, మద్యం అమ్మకూడదని, తాగకూడదని ఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై పలువురు గ్రామస్తులను ప్రశ్నించగా మద్యం, సారాకు బానిసలైన వారి కుటుంబాలు జీవితాలు ఎలా ఉన్నాయో మేం చూస్తూనే ఉన్నామని, మా గ్రామంలో ఏ కుటుంబం కూడా అలా ఉండకూడదని, సంతోషంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

కట్టుబాటునూ పాటిస్తూ..

నాడు గ్రామంలో మద్యం తాగినా అమ్మినా జరిమానా విధించాల్సి ఉంటుందని కలిసి కట్టుబాటు చేసుకున్నారు. దానికి ఎవరైనా వ్యతిరేకంగా వెళ్తే రూ.5వేల జరిమానా కూడా విధించాల్సి ఉంటుందని బాండ్ రాసి గ్రామస్తులు అందరూ సంతకాలు చేశారు. ఇక నాటి నుంచి నేటి వరకు ఆ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తూ ఐక్యతగా నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు.

స్వచ్ఛందంగా మూసిన మద్యం దుకాణాలు

గ్రామంలో ఇద్దరు ముగ్గురు వ్యక్తులు కట్టుబాటుకు వ్యతిరేకంగా బెల్టుషాపు తెరిచారు. ఆ సమయంలోనే వారిని గ్రామస్తులు మందలించారు. అయినా బెల్టు దుకాణాన్ని నిర్వహిస్తున్నా ఎవరూ మద్యాన్ని కొనకపోవడంతో చేసేదేం లేక వారే స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసుకున్నారు.

గ్రామ తీర్మానం అమలు చేస్తున్నాం



“ నాడు మద్యానికి వ్యతిరేకంగా గ్రామ పెద్దలు చేసిన తీర్మానాన్ని అమలు చేస్తున్నాం. మద్యం విషయంలో గ్రామస్తులందరూ ఒక్క మాటమీదే నిలబడతాం. మద్యం లేకపోవడంతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎవరి పనికి వారు వెళ్తారు.

– షేక్ సైదాబీ, బండపాలెం

మద్యం అమ్మితే గ్రామ బహిష్కరణ



“ గ్రామంలో కట్టుబాటుకు వ్యతిరేకంగా ఎవరైనా మద్యం అమ్మడానికి ప్రయత్నం చేస్తే ఊరుకోం. అవసరమైతే అందరం కలిసి వారిని ఊరి నుంచి బయటకు పంపిస్తాం. ఇంత వరకు మా కట్టుబాటుకు వ్యతిరేకంగా వెళ్లలేదు. అలా చేస్తే జరిమానా, గ్రామ బహిష్కరణ తప్పదు. ఆ భయానికి ఎవరూ అమ్మడానికి ముందుకు రావడం లేదు.

– దంతాల వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు

బంధువులు వస్తే మరో ఊరు వెళ్లాల్సిందే



“ మా గ్రామంలో మద్యం విక్రయిస్తే జరిమానా విధిస్తాం. ఎవరైనా తాగాలనుకున్నా, బంధువులు వచ్చినా పక్కనే ఉన్న తమ్మర, లేదా కోదాడకు వెళ్లాల్సిందే. నాటి కట్టుబాటును అందరం పాటిస్తున్నాం.

– వెన్నబోయిన వెంకటేశ్వర్లు, గ్రామస్తుడు

సహజీవనం చేసిన వ్యక్తి హత్య

- పరారీలో నిందితురాలు

సూర్యాపేట క్రైం: సహజీవనం చేసిన వ్యక్తిని ఓ మహిళ హత్యచేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఉమ, నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన వెంకటేష్‌తో సహజీవనం చేస్తూ ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. ఇటీవల మద్యానికి బానిసై తనను ఇబ్బంది పెడుతున్న వెంకటేష్‌ను అడ్డు తొలగించుకోవాలని భావించిన ఉమ శుక్రవారం అర్ధరాత్రి చున్నీతో గొంతు నలిమి హత్య చేసింది. వెంకటేష్ మృతదేహాన్ని చూసిన ఇరుగు పొరుగు వారు వెంకటేష్ తండ్రి జానయ్యకు సమాచారం ఇవ్వగా అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ పరారీలో ఉన్నట్లు తెలిసింది. వెంకటేష్‌కు గతంలో వివాహం కాగా మతిస్థిమితం లేని భార్య యశోద, కుమారుడు నవీన్ ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో గాయపడ్డ యువకులు

మోత్కూరు: ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని గుండాల క్రాస్ రోడ్డుకు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన గొలుసుల యాదగిరి కుమారుడు శ్రీనివాస్, గుండాల మండలం మాసాన్‌పల్లి మాజీ సర్పంచ్ కేమిడి సోమయ్య కుమారుడు అభిరామ్ కలిసి మోత్కూరు నుంచి గుండాల వైపు వెళ్తున్నారు. అదే సమయంలో గుండాల నుంచి ఫ్రీజర్ బాక్సు తీసుకొని వస్తున్న ట్రాక్టర్‌ను అరవిందో ఫాంహౌస్ వద్ద బైక్‌తో ఢీకొట్టారు. దీంతో ట్రాక్టర్ ముందు భాగాన టైర్ ఊడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అభిరామ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

సిలిండర్ పేలి చిన్నారులకు గాయాలు

భువనగిరి: ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు చిన్నారులకు గాయాలైన ఘటన శనివారం భువనగిరి మండలంలోని వీరవెల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. వీరవెల్లి గ్రామానికి చెందిన సిలివేరు కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఇంట్లో చిన్న కిరాణ దుకాణం నడుపుతుండడంతో తన ముగ్గురు పిల్లలు మునీశ్వర్, ప్రణతి, ముధునిని అక్కడే ఉంచి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కుమార్ ఇంటి సమీపంలోనే హోటల్ ఉండటంతో అందులోని కొన్ని వస్తువులు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్



HOUSE FOR SALE
■ నల్లగొండ పట్టణం న్యూకలెక్టరేట్ ప్రక్కన G+1 పర్మిషన్ గల ఇల్లు 120 చ॥గజాలు 900 SFT గలది అమ్మబడును. ధర: 30 లక్షలు, సంప్ర॥ 8341550528 [YA-14879]

FOR SALE
■ MAHADEV CONSTRUCTIONS మావద్ద ప్లాట్లు, ఇండ్లు కొనబడును, అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ఇండ్లు కట్టించి ఇవ్వబడును. మెటీరియల్స్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్‌కి ఫైనాన్స్ ఇవ్వబడును. సంప్ర॥ 9948178777 [Y-772538]

TO-LET
■ నల్లగొండ పట్టణం Hyd రోడ్ మధర్ డెయిరీ ఫాం ఎదురుగా అవనిగడ్డ కోచింగ్ సెంటర్ ప్రక్కన అన్నివసతులు కలిగిన 2BHK ఇల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9493902310 [Y-798226]

HOUSE FOR SALE
■ Ready to Occupy Duplex Luxury Villas In the Best Gated Community at Miryalaguda Next to New D-mart Clubhouse, Swimming Pool Fully Operational Must See! Call: 7013578378. [H-780829]



■ శ్రీ విఘ్నేశ్వర హోండా నల్లగొండ యందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్, సర్వీస్ సూపర్‌వైజర్స్ (Male) మరియు నార్కట్‌పల్లి యందు సేల్స్ ఎగ్జిక్యూటీవ్ కావలెను. సంప్ర॥ 92900 53788, 92901 43623 [Y-14878]



BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్రూప్–4 పరీక్ష కేంద్రాల వద్ద ఇలా..


భువనగిరిలో కాలుకి కట్టు కట్టుకొని వచ్చిన అభ్యర్థిని మెటల్ డిటెక్టర్‌తో చెక్ చేసి పంపిస్తున్న పోలీసులు సిబ్బంది


చౌటుప్పల్‌లో ఓ పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ మరిచిపోయిన అభ్యర్థికి హాల్‌టికెట్ అందజేస్తున్న మిత్రుడు


సూర్యాపేటలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద చెవుల కమ్మలను తీసివేస్తున్న దివ్యాంగురాలు


ఎగ్జామ్ సెంటర్ బయటే షూ విప్పుతున్న అభ్యర్థి


సూర్యాపేట జూనియర్ కళాశాలలో అభ్యర్థుల బ్యాగులను బండిపై తరలిస్తున్న సిబ్బంది


నల్లగొండలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద మధ్యాహ్నం తన బిడ్డను లాలిస్తూ భోజనం చేస్తున్న మహిళా అభ్యర్థి


హాలియాలో పరీక్ష కేంద్రం వద్ద చంటి పిల్లాడికి చీరతో ఊయల కట్టి పక్కనే సేద తీరుతున్న తండ్రి


తల్లి పరీక్షకు వెళ్లడంతో పాపకు పాలు పడుతున్న అమ్మమ్మ

క్లుప్తంగా

3న కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల మూడవ తేదీన వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల, అధ్యక్ష కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డులు వెంట తెచ్చుకోవాలని కోరారు.

కొల్లు శ్రీనివాస్‌గౌడ్‌కు ఓయూ డాక్టరేట్ ప్రదానం



సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండల పరిధిలోని కాసరబాద గ్రామానికి చెందిన కొల్లు శ్రీనివాస్‌గౌడ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. సూర్యాపేట, భువనగిరి మున్సిపాలిటీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై ప్రొఫెసర్ బి. అమరేందర్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. అతడికి తెలంగాణ గెజిటెడ్ లెచ్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, గౌడ ఉద్యోగుల సంఘం నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

సూర్యక్షేత్రం సందర్శన

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్లోక స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కాగా సూర్యక్షేత్ర విశిష్టతను ఈ క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్లోక విద్యాలయం కరెస్పాండెంట్ మారం వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులను నిర్వహిస్తున్నందున ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నర్సయ్య



తిరుమలగిరి : విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సారంగుల నర్సయ్యను శనివారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సంక్షేమం కోసం పాటుపడతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అర్వపల్లి : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం సీతరాంపురంలో శనివారం జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సుంకరి వెంకన్న తన గేదెను రోజు వారిగానే శనివారం మేతకు వదిలాడు. గేదె గ్రామ శివారులోని చెల్కలో మేత మేస్తుండగా తెగిపడిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడిక్కడే మృతి చెందింది. ఈ గేదె రూ.65వేల విలువ చేస్తుందని బాధిత రైతు వెంకన్న తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మహ్మద్‌అలీ మృతి పార్టీకి తీరనిలోటు

ఆత్మకూర్ (ఎస్) : గ్రామంలో ప్రజాబలం ఉన్న నాయకుడు మహ్మద్‌అలీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గ్రామసర్పంచ్, పార్టీ నాయకుడు మహ్మద్‌అలీ సంతాపసభను దాచారం గ్రామంలో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి, చకిలం రాజేశ్వర్ రావు, అంజద్ అలీ, సర్పంచ్‌లు యల్లా చారి, లింగా నాయక్, ఉపేందర్ రెడ్డి, వీరన్ననాయక్, గుడిపూడి శ్రీనివాస్, గంగరబోయిన శంకర్, మూల ఎల్లయ్య, శిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోటార్ వైర్లు చోరీ

చివ్వెంల : గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు అపహరించిన ఘటన చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురం గ్రామానికి చెందిన ధరావతు మంచ, ధరావతు పంతులు, ధరావతు జామ్లాకు చెందిన వ్యవసాయ మోటార్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వీరితో పాటు మరికొంత మంది రైతుల వైర్లను కూడా అపహరించారు. శనివారం తెల్లవారుజామున మోటార్ల వద్దకు వెళ్లిన రైతులకు వైర్లు చోరీకి గురైన విషయం గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. అందని విద్యుత్

- తొండ గ్రామంలో పది రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న రైతులు, గ్రామస్తులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తొండ గ్రామంలో ఎండిపోతున్న నారుమళ్లు



విద్యుత్ స్తంభంపై మండుతున్న తీగలు

తిరుమలగిరి : ఏ సాంకేతిక సమస్య వచ్చినా 24 గంటల్లో పరిష్కరిస్తామని చెప్పే విద్యుత్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో గత పది రోజులుగా విద్యుత్ సమస్య నెలకొంది. దీంతో రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 20వ తేదీన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి లైన్‌మెన్ సహాయకుడిగా ఉన్న మహేష్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. కానీ ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో అతడు విద్యుదాఘాతానికి గురై కిందపడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన లైన్‌మెన్‌ను తాత్కాలికంగా పక్కకు పెట్టారు. అప్పటి నుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామంలో కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా జరగడం లేదు. మరికొన్ని చోట్ల విద్యుత్ వచ్చినా ఎక్కువసేపు ఉండటంలేదు. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా రావడం లేదు. విద్యుత్ తీగలు తెగినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న నారు మళ్లు..

సాధారణంగా వర్షా కాలంలో జూన్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు రైతులు నారుమళ్లు పోస్తారు. ఎక్కువ మంది రైతులు పదిహేను రోజుల క్రితం నార్లు పోశారు. కానీ విద్యుత్ సరఫరా సరిగాలేకపోవడంతో గ్రామంలో నారుమళ్లు అన్నీ ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నార్లు పోసుకునే రైతులు ఇంకా ఆలస్యమవుతుందని వాపోతున్నారు. కొద్ది మంది రైతుల వరి మండెలు సైతం ఎండిపోయాయి. ఇదే గ్రామంలోని నల్లేనిగడ్డ ప్రాంతంలో 20 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే బాగు చేయించుకొని రైతులు తీసుకొచ్చారు. 20 రోజులైనా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సరఫరా లేకపోవడంతో మూగ జీవాలకు తాగేందుకు నీళ్లు లేకుండా పోయిందని వారు అంటున్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని, ఫోన్లు చేసినా రావడం లేదని తెలుస్తోంది. గ్రామంలో 250 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా ఏ ఒక్క దానికి కూడా ఏ, బీ స్విచ్ లేకపోవడంతో ఒక్క చోట సమస్య వస్తే ఊరు మొత్తం సరఫరా నిలిచిపోతుందని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యలను పట్టించుకోవాలని, గ్రామంలో లైన్‌మన్, హెల్పర్లను నియమించాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వడం లేదు



ఇరవై రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతె బాగు చేసి తీసుకొచ్చాం. ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. నార్లు పోసుకుందామంటే నీళ్ల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– చింతకింది యాదగిరి, రైతు, తొండ

పది రోజులుగా ఇబ్బందులు



మా గ్రామంలో పురుషోత్తం కుంట ప్రాంతంలో పది రోజుల నుంచి విద్యుత్ రావడం లేదు. వచ్చినా పది నిమిషాలు కూడా ఉండటం లేదు. నారులన్నీ ఎండిపోతున్నాయి. అధికారులు పట్టించుకొని వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి.

– వేల్పుల నర్సయ్య, రైతు

కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న సత్యనారాయణ

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని బీఆర్‌టీయూ నియోజకవర్గ బాధ్యుడు సత్యనారాయణ గౌడ్ అన్నారు . శనివారం తుంగతుర్తి మండలం సంగెం గ్రామంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బీమా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బీఆర్‌టీయూ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అష మల్ల సుశీల, సామెల్, ఎంపీటీసీ అలెరోసే నాయకులు రాములు, శ్రీను, వెంకన్న, సోమేశ్, సుధాకర్, వెంకన్న, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘంలో జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ సైదులు

తుంగతుర్తి : సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయాలని సొసైటీ చైర్మన్ డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో రైతు సేవ సహకార సంఘంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీ ద్వారా రైతులు రుణాలను తీసుకొని సకాలంలో చెల్లించాలని, సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు యాదగిరి, రామచంద్రు, మజీద్ బీరప్ప, సిబ్బంది యాదగిరి, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వెలిశాలలో చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ ఆకుల వీరయ్య

తిరుమలగిరి : సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను వెలిశాల గ్రామంలో సర్పంచ్ ఆకుల వీరయ్య శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన ఎల్లంల నర్సయ్యకు రూ.40 వేలు, మొగిలి దామోదర్‌కు రూ.30 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుంభం సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తి ఎంతో పవిత్రమైంది



భానుపురి : సూర్యాపేటలో డాక్టర్లను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు



తుంగతుర్తిలో డాక్టర్‌ను సన్మానిస్తున్న వాసవీ వనితా క్లబ్ సభ్యులు



తిరుమలగిరిలో..

భానుపురి : సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దేవిరెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. డాక్టర్స్ డే పురస్కరించుకొని శనివారం పట్టణంలోని లయన్స్ సర్వీస్ సెంటర్‌లో పట్టణంలోని పలువురు డాక్టర్లను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో వైద్యులు రామ్మూర్తి యాదవ్, చంద్రశేఖర్, రమేష్ చంద్ర, పెద్దిరెడ్డి మహేష్, బడుగుల యశ్వంత్, శ్రీనివాస రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సూర్యాపేట కార్యదర్శి రంగు దిలీప్ కుమార్, కోశాధికారి బెజగం ఫణి కుమార్, ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి కళ్యాణ్ కుమార్, భోనగిరి విజయ్ కుమార్, సూకల వెంకటరెడ్డి, కుమ్మరికుంట్ల లింగయ్య, వాంకుడోతు వెంకన్న పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి..

ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శనివారం నేషనల్ డాక్టర్ డే సందర్భంగా లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ చంద్ర, రాజమోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి కళ్యాణ్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి : వరల్డ్ డాక్టర్స్ డేను వాసవీ డైమండ్స్ క్లబ్, వనితా గోల్డెన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ చెన్నా నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వినయ్, వీణ, సభ్యులు సత్యనారాయణ, నిర్మల, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులకు శాలువాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద పద్మారెడ్డి, డాక్టర్లు మురళీధర్, అనిల్‌కుమార్, సురేష్, రమేష్, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్‌కుమార్, రామచంద్రం గౌడ్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, కందుకూరి కృష్ణమాచారి, వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఎన్.శాతవాహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–4 పరీక్ష



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్



నూతనకల్ : పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పెన్‌పహాడ్‌లో పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



తిరుమలగిరి పరీక్ష కేంద్రంలో..

నూతనకల్ : మండల కేంద్రంలో నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని రూట్ ఆఫీసర్ ఎండీ జమీరుద్దీన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజయమేరి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఒక్కో సెంటర్‌లో 240మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240మంది అభ్యర్థులకు 190మంది హాజరు కాగా, విజయమేరి ఉన్నత పాఠశాలలో 240మంది అభ్యర్థులకు 230మంది హాజరైనట్లు తెలిపారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా ఉదయం 240మంది అభ్యర్థులకు గాను 198 హాజరయ్యారు. మధ్యాహ్నం 198మంది అభ్యర్థులకు గాను 196మంది హాజరైనట్లు ఎగ్జామ్ లైజన్ ఆఫీసర్ కృష్ణసందీప్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

తిరుమలగిరి : తిరుమలగిరిలో టీఎస్‌పీఎస్‌సీ గ్రూపు –4 పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతారం మోడల్ పాఠశాలలో 384 మందికి 98మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా పాఠశాలలో 240 మందికి 41 మంది గైర్హాజరు అయ్యారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో శనివారం గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 1608 మంది అభ్యర్థులకు గాను 1273 మంది హాజరైనట్లు ఎగ్జామ్ రూటు ఆఫీసర్ రాంప్రసాద్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన గ్రూప్ –4 పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కేంద్రంలో 312 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఉదయం 67 మంది అభ్యర్థులు, సాయంత్రం 70 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

నూతనకల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దేసోజు మధు కోరారు. శనివారం మండల కేంద్రంలో 8వ రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ముండ్ల మలయ్య, బొలగాని రమేష్, మున్నా నాగమల్లు, మహేందర్, సందీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేయాలి



ధ్రువపత్రం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి విద్యార్థులు కృషి చేయాలని మండల కో ఆర్డినేటర్ మరికంటి అశోక్ అన్నారు. శనివారం తాళ్లసింగారం గ్రామంలో ఎన్‌ఎస్‌యూఐ గ్రామ శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జటంగి నరేష్, ఉపాధ్యక్షుడిగా వీరబోయిన మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లెంల శివతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్స లింగయ్య, జటంగి బుచ్చిబాబు, రాజలింగం, అయోధ్య, గణేష్, లింగయ్య, విద్యాసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



పెన్‌పహాడ్ : పొట్లపహాడ్‌లో గ్లాసులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పుష్పావతి, దాత పద్మ



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం పాఠశాలకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

పెన్‌పహాడ్ : పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ రామినేని పుష్పావతికృష్ణయ్య అన్నారు. పొట్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు రాగిజావ తాగడానికి గ్రామానికి చెందిన బంగారు నర్సింహాచారి జ్ఞాపకార్థం అంగన్‌వాడీ టీచర్ బంగారు పద్మ శనివారం రూ. 5వేల విలువ చేసే గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుకాదేవి, వెంకన్న, పిచ్చిరెడ్డి, విజయ, పృథ్వీరాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.తబిత కోరారు. పాఠశాలకు చెందిన 1988–89 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలోని గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధర్మారపు వెంకటయ్య, దాసరి సోమయ్య, పెద్ది శ్రీనివాస్, పగిళ్ల సైదులు, ఎం.మల్లిఖార్జునాచారి, ఎం.శ్రీనివాసాచారి, ఏలె వెంకన్న, కుంభం వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు



జాజిరెడ్డిగూడెంలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



సూర్యాపేటలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



తిరుమలగిరి : ప్రచారం నిర్వహించి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన పార్టీ విస్తారక్ వీవీఎస్ కృష్ణప్రసాద్‌తో కలిసి శనివారం జాజిరెడ్డిగూడెంలోని పలు బూత్‌లలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, కూర శంకర్, కీర్తి వెంకటేశ్వర్లు, జిన్నె అశ్విన్, మారపాక రాములు, వేముల సత్తయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మున్సిపాలిటీ కేంద్రంలోని 3, 13, 23 బూత్‌లలో కర్ణాటక నుంచి వచ్చిన బీజేపీ విస్తారక్‌లతో సుదానారాయణ శర్మ, వర్ష శర్మ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు దీన్‌దయాల్, మూల వెంకట్‌రెడ్డి, కొండ సోమయ్య, ఈదునూరి జ్యోతి, వెంకటేశ్వర్లు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, స్వామిరెడ్డి, మంజులారెడ్డి, లక్ష్మారెడ్డి, బీరం తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికీ బీజేపీ

దురాజ్‌పల్లి : జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. వార్డు అధ్యక్షుడు జోగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడే ఎండీ అబీద్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్ గౌడ్, జిల్లా నాయకులు పోలగాని ధనుంజయగౌడ్, ఆకారపు పరిపూర్ణచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగారం : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 3న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత బంధు, రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు సీపీఎం నాయకులు కందే భిక్షం గుడపూడి వెంకటేశ్వర్లు, తంగేళ్ల వెంకన్న, పద్మ, యాదమ్మ, రాములు, నాగయ్య, అంజమ్మ, స్వరూప ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నూర్జహాన్‌పేట గ్రామానికి చెందిన ధరావత్ శంకర్, అనంతారం గ్రామానికి చెందిన మామిడి సైదమ్మలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అదే విధంగా మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దొంతగాని గోపయ్య గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతుండగా అతడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బచ్చుపల్లి నాగేశ్వర్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మామిడి శ్రీనివాస్, మండలి పిచ్చయ్య, మల్గిరెడ్డి సంజీవరెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, గొర్ల అంజయ్య, మామిడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన పటేల్ మధుసూదన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. దీంతో శనివారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ అతడిని పరామర్శించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కర్నాని యాదగిరి అనారోగ్యంతో మరణించడంతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, పాల సంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బూర్గుల రాంబాబు, జేడీ మహేష్, బూర్గుల నాగేందర్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు ఈ ఏడాది నుంచి ఉచితంగా అందించే నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండలానికి మొదటి విడతగా 4,700 నోట్ పుస్తకాలు రాగా శనివారం పాఠశాలల వారీగా పంపిణీ చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నర్సింగ దుర్గయ్య, ఎమ్మార్సీ సిబ్బంది వాకిటి కవిత, బి.ఏడుకొండలు పాల్గొన్నారు.

వర్ధంతి సభ కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు అలుగుబెల్లి వెంకటనర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి సభను ఈ నెల 3న ఆత్మకూరు మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా అర్వపల్లిలో శనివారం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, బయ్య లింగయ్య, సామేలు, దండోలు ధనుంజయ్, శ్రీను, సతీష్, రామలింగం, లింగయ్య, సోమయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునగాల : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బొల్లం పరశురాములు(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా పరశురాములు పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో మిత్ర బృందం రూ.21వేలను సేకరించి శనివారం మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.